గురుకులంలో గాడితప్పిన క్రమశిక్షణ

- తూప్రాన్ గురుకులంలో ఘర్షణ వాతావరణం
- సీనియర్లు.. జూనియర్లు అంటూ విభేదాలు
- పర్యవేక్షణ కొరవడటమే కారణమా?



తూప్రాన్, సెప్టెంబరు 3: గురుకులం అంటేనే క్రమశిక్షణకు మారుపేరు.. అక్కడ చదువు అంటే గుర్తింపు.. ఇవన్నీ ఒకప్పటి మాట. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో వరుస ఘటనలు అదంతా ఒకప్పటి మాట అనేట్లు చేస్తున్నాయి. తూప్రాన్ వద్ద 2002లో తెలంగాణ గురుకుల పాఠశాల మంజూరైంది. సొంత భవనం లేక వర్గల్ మండలం నాచారం వద్ద నిర్వహించారు. మాజీ మంత్రి గీతారెడ్డి చొరవతో అల్లాపూర్ శివారులో హైవే పక్కనే కొత్త భవనం నిర్మించి 2008 నుంచి అక్కడే నిర్వహిస్తున్నారు. 2018లో తెలంగాణ గురుకుల పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు. ప్రస్తుతం 579 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దాడుల సంస్కృతి


దాడిలో గాయపడిన విద్యార్థి(ఫైల్)

తూప్రాన్ గురుకుల పాఠశాల అంటే ఒకప్పుడు మంచి గుర్తింపు ఉండేది. కానీ ప్రస్తుతం క్రమశిక్షణ తప్పి సీనియర్లు, జూనియర్లు పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. జూలై 16న రాత్రి ఇంటర్ విద్యార్థులు జూనియర్లపై విచక్షణ కోల్పోయి దాడులు చేశారు. సీనియర్లకు గౌరవం ఇవ్వడం లేదని కక్ష పెంచుకుని, మాట్లాడుకుందామని పిలిచి దాడులు చేయడంతో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గదిలోని సీలింగ్ ఫ్యాన్, బకెట్లు ధ్వంసమయ్యాయి. అప్పట్లో గురుకుల పాఠశాలల కార్యదర్శి రమణకుమార్, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐ శివానందం, ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకటరెడ్డి గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ నెలన్నర గడవక ముందే రెండ్రోజుల క్రితం చిన్న విషయానికే వివాదం చెలరేగి దాడులకు దారితీసింది. ఆదివారం రాత్రి 10వ తరగతి విద్యార్థిని జూనియర్లు తోసేశారని కక్ష పెంచుకుని.. 9 మంది సీనియర్లు కలిసి తొమ్మిదో తరగతి విద్యార్థులు ముగ్గురిని విచక్షణారహితంగా కొట్టారు.

కొరవడిన క్రమశిక్షణ

తూప్రాన్ గురుకులంలో క్రమశిక్షణ కొరవడిందని ఆరోపణలున్నాయి. విద్య నేర్చుకోవాల్సినవారు సీనియర్లు, జూనియర్లు అంటూ బేషజాలకు పోతున్నారు. క్రమశిక్షణ నేర్పాల్సిన టీచర్లూ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. అధికారులు స్పందించి విద్యార్థుల నడవడికపై నిఘా పెట్టాలని తల్లిదండ్రులు కోరారు.

భారీ వర్షాలతో జిల్లాకు ఊరట కలిగింది. మొన్నటిదాకా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రిజర్వాయర్లు, చెరువుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. భూగర్భజలాలు సైతం మెరుగు పడలేదు. శని, ఆదివారాల్లో దంచికొట్టిన వర్షాలకు పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. బోసిపోయి కనిపించిన రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వచ్చే యాసంగి సీజన్ వరకు సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయి.


మత్తడి దూకుతున్న శనిగరం ప్రాజెక్టు
అలుగు పారుతున్న సిద్దిపేట కోమటిచెరువు

సాగుకు భరోసా..

- జిల్లాలో రికార్డుస్థాయి వర్షపాతం
- నాలుగు రిజర్వాయర్లకూ జలకళ
- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- వచ్చే యాసంగిదాకా నీటికి ఢోకాలేదు

సాధారణ వర్షపాతం - 476 మి.మీ
కురిసింది - 740 మి.మీ.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట,సెప్టెంబరు 3 : పూర్తిగా వర్షాల మీదనే ఆధారపడ్డ జిల్లాకు ఈ సీజన్ కూడా కలిసివచ్చింది. భారీ వర్షాలతో జిల్లాలోని నీటి వనరులన్నీ నిండుకుండల్లా మారాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు మొదట్లో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు ఏర్పడడంతో జిల్లాలోని రిజర్వాయర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గోదావరి నది నుంచి ఎత్తిపోసే అవకాశం లేకపోవడంతో రిజర్వాయర్లన్నీ బోసిపోయాయి. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరుకు వరద పోటెత్తింది. గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకూ వరద పుంజుకుంది. ఇటు ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు శ్రీరాంసాగర్ వరద కాలువతోపాటు కూడవెల్లి, నర్మాల, మూలవాగుల నుంచీ మిడ్‌మానేరుకు వరద పోటెత్తుతోంది. ఫలితంగా మిడ్‌మానేరు నుంచి జిల్లా సరిహద్దులోని 3.5టీఎంసీల సామర్థ్యం కలిగిన అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు ప్రారంభించగా, అక్కడి నుంచి 3 టీఎంసీల సామర్థ్యంగల రంగనాయకసాగర్‌కు నీటిని తరలిస్తున్నారు. అదేవిధంగా 50టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది 15 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే 13 టీఎంసీల వరకు ఎత్తిపోసినట్లు అంచనా. ఇక 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మసాగర్‌కూ జలకళ వచ్చింది. మిడ్‌మానేరుకు వరద ప్రవాహం ఉన్నందున మళ్లీ వచ్చే వానాకాలం సీజన్ దాకా జిల్లాలోని రిజర్వాయర్లకూ నీటి ఢోకా లేదు.

మత్తళ్లు దూకిన చెరువులు, కుంటలు..


జిల్లాలో సుమారు 3వేల చెరువులు, కుంటల్లో 80 శాతానికి పైగా జలకళను సంతరించుకున్నాయి. 50 శాతానికి పైగానే మత్తళ్లు దూకుతున్నాయి. కొహెడ మండలంలోని శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. కూడవెల్లి, హల్దీ, మోయతుమ్మెద వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెక్‌డ్యాములు సైతం అలుగు పారుతున్నాయి.

740 మి.మీల వర్షపాతం..

ఈ వర్షాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 476 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాలి. అయితే తాజా పరిణామాలతో 740 మి.మీల వర్షపాతం నమోదైంది. చేర్యాల, వర్గల్, ములుగు, మర్కుక్ మండలాలు మినహా అన్ని మండలాల్లోనూ అత్యధిక వర్షపాతం నమోదైంది. ధూళిమిట్ట, బెజ్జంకి, కొండపాక, దౌల్తాబాద్, మిరుదొడ్డి, సిద్దిపేట అర్బన్, తొగుట, నంగునూరు, అక్కన్నపేట, దుబ్బాక, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు మండలాల్లో 750 మి.మీల నుంచి 950 మి.మీల వరకు రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది.

తాగు, సాగునీటి కష్టాలకు చెల్లు..

భారీ వర్షాలతో భూగర్భజలాలు వృద్ధి చెందడంతో బావులు, బోర్లలో ఊటపెరిగినట్లుగా సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇక రిజర్వాయర్లు, చెరువులు, చెక్‌డ్యాములు నిండుకుండల్లా మారడంతో ఆయకట్టు సాగుకూ ప్రయోజనం చేకూరనున్నది. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు, సిద్దిపేట నియోజకవర్గానికి తాగునీటిని నిరంతరం సరఫరా చేయవచ్చు. అదేవిధంగా జిల్లాలో సుమారు 5లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న వివిధ పంటలకూ నీటి ఇబ్బందులు ఉండబోవని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఇక యాసంగి సీజన్‌లోనూ వరి, మొక్కజొన్న, ఇతర పంటలను సాగుచేయడానికి ప్రస్తుత నీటి నిల్వలను సరిపోతాయని చెబుతున్నారు.


జలకళ సంతరించుకున్న రంగనాయకసాగర్


జిల్లా సరిహద్దులో ఉన్న అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్


నీటితో కళకళలాడుతున్న కొండపోచమ్మసాగర్


హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపై వరదనీరు

శాశ్వత పరిష్కారం చూపాలి..

పట్టణ ప్రధాన రహదారిని వరదనీరు ముంచెత్తకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పోతారం(ఎస్) సమీపం నుంచి వచ్చే వరదను మళ్లించడంతోపాటు వ్యవసాయ మార్కెట్ నుంచి వచ్చే వరద కాలువను మరింత వెడల్పు చేయాలని పేర్కొంటున్నారు.

హుస్నాబాధ తీరేనా?!

- చెరువులా మారుతున్న ప్రధాన రహదారి
- నీట మునుగుతున్న దుకాణాలు
- హైవే పనులు నత్తనడక..

ఏటా వర్షాకాలంలో జలగండం

హుస్నాబాద్, సెప్టెంబరు 3: వర్షాకాలం వచ్చిందంటే హుస్నాబాద్ పట్టణ ప్రజలు, వ్యాపారుల్లో గుబులు మొదలవుతుంది. ఎక్కడ వరద నీరు వచ్చి దుకాణాలు, ఇళ్లలో చేరి ఆస్తి నష్టం జరుగుతుందోనని ఆందోళనపడుతున్నారు. ఇది గత పుష్కరకాలంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో హుస్నాబాద్ పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకొని రాకపోకలు స్తంభించాయి. ఇళ్లు, దుకాణాల్లోకి వరద నీరు చేరడతో లక్షల రూపాయల నష్టం జరిగింది. చిన్నపాటి వర్షం వచ్చినా పట్టణంలోని సిద్దిపేట- హన్మకొండ ప్రధాన రహదారి వరదనీటితో చెరువును తలపిస్తున్నది. సహకార బ్యాంకు, బస్టాండ్ నుంచి మల్లెచెట్టు చౌరస్తా వరకు దాదాపు కిలోమీటరు మేర నడుం లోతు నీరు నిలువడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుధీర్ పెట్రోల్ బంక్, సహకార సంఘం ఒకవైపు నుంచి, వ్యవసాయ మార్కెట్, సాయినగర్, నాగారం రోడ్డు రెండువైపులా పెద్ద ఎత్తున వరద వచ్చి ప్రధాన రహదారిని ముంచెత్తుంది. నీటిని మళ్లించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో దుకాణ సముదాయాల్లోకి నీరు చేరుతున్నది. ఎగువన ఉన్న గొలుసుకట్టు కుంటలు మాయమై అందులో ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలు జరుగడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నది.

హైవే పనులతో మరింత జఠిలం..

పట్టణంలో జరుగుతున్న సిద్దిపేట- ఎల్కతుర్తి నేషనల్ హైవే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ సమస్య మరింత జఠిలమవుతుంది. రోడ్డుకు ఇరువైపులా వరదనీటి కాలువ పనులు చేస్తుండగా దీనిని ఒక చోట చేస్తూ మరో చోట వదిలిపెడుతుండటంతో వరద నీరు వెళ్లేందుకు దారి లేక రోడ్డును ముంచెత్తుంది. పట్టణంలో హైవే పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంకా ఇరువైపుల కాలువ నిర్మాణ పనులే పూర్తి కాలేదు. ఈ పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అసహనం వ్యక్తం చేశారు. దీనిని త్వరితగతిన పూర్తి చేస్తే కొంత సమస్య తీరుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.


హుస్నాబాద్ పట్టణంలో నేషనల్ హైవే పనులు

కస్తూర్బాకు రూ.57లక్షలు

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి
- కలెక్టర్ మను చౌదరి
- పలు మండలాల్లో పర్యటన

దుబ్బాక/గజ్వేల్/దౌల్తాబాద్/సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 3: వర్షానికి ఊరుస్తున్న భవనంలో తామేలా ఉండేదనీ దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు కలెక్టర్ మను చౌదరి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. మంగళవారం కస్తూర్బాతోపాటు, మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెంటరీ గదులు వర్షానికి నీరుకారడం, ప్రహరీ లేక పందులు సంచరిస్తున్నాయని తెలుసుకున్న ఆయన వాటి నిర్మాణానికి 57 లక్షలు మంజూరైనట్లు ప్రకటించారు. వాటి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లను ఆలస్యం చేయకుండా డెంగ్యూ పరీక్షలు చేయాలని, మెడిసిన్ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో గల కోనాపురం చెరువును పరిశీలించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఇరిగేషన్ డీఈ చాందిరాం, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ శ్రవణ్, ఆర్‌ఐ కృష్ణ, ఎంపీడీవో ప్రవీణ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండలంలోని లింగారాజుపల్లి మహాత్మాజోతిరావు పూలే పాఠశాల, కళాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాతబడిన హాస్టల్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్నను ఆదేశించారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, పీడీ సాయికృష్ణ పాల్గొన్నారు.

మట్టి గణపతులనే ప్రతిష్టించాలి..

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని కలెక్టర్ మను చౌదరి కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ఆర్.సీపురం వారు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.


దుబ్బాక కస్తూర్బా పాఠశాలలోని గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సొమ్ము.. సెల్లార్‌పాలు..!


సెల్లార్‌లో నిర్మించిన సమీకృత భవనం

- అంచనాలు పెంచినా అందుబాటులోకి రాని భవనం
- సెల్లార్‌లోనే గోడలు కట్టి మమ..
- పిల్లర్ల స్థాయిలోనే అసలైన భవనం
- రెండేళ్లు దాటకముందే బీటలు
- ఇదీ దుబ్బాక సమీకృత భవనం కథ

దుబ్బాక, సెప్టెంబరు 3: చినుకుపడితే.. కాలుపెట్టడానికి వీలుండదు. వర్షం వచ్చినా చెరువుగా మారుతుంది. కోట్లు కుమ్మరించి కట్టినా భవనానికి బీటలు మాత్రం తప్పలేదు.. ఇదీ దుబ్బాక సమీకృత భవనం దుస్థితి. 2017లో దీని నిర్మాణం కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయి. అయితే అధికారులు ఇక్కడి మట్టి నమూనాలను పరీక్షించి మరీ నిర్మాణానికి అనువైన ప్రదేశం కాదని తేల్చారు. అంతేకాకుండా అప్పటికే అక్కడ చేనేత కార్మికుల గృహసముదాయం నిర్మించి చేతులు కాల్చుకున్నారు. అయినా సమీకృత భవనాన్ని అదే స్థలంలో నిర్మించాలనే మొండివైఖరి మూలంగా కోట్లాది రూపాయాలు వృథా అయ్యాయి. ఎకరా 30 గుంటల భూమిలో 4వేల 46 చదరపు మీటర్లలో భవన నిర్మాణం చేపట్టారు. ఇందుకు మొదట భూమిలోతు ధరి (గట్టిభూమి) వచ్చే వరకు పునాదులు తీశారు. అందుకోసం సుమారు రూ.11 కోట్లు వెచ్చించడమే కాకుండా, మరో రూ.7కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో 2019లో మరో రూ.7 కోట్లను మంజూరు చేసింది. వీటితో కలిపి సుమారు రూ.17 కోట్ల భూమిలోనే ఖర్చు అయ్యాయనీ కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. మరో రూ.11 కోట్ల వరకు ఖర్చు అవుతాయనీ కాంట్రాక్టర్ ప్రతిపాదనలు అందించగా, ప్రభుత్వం కూడా చేతులెత్తేసింది. చేర్యాల లాంటి పలు మండలాలల్లో కేవలం రూ.17 కోట్లతోనే అందమైన భవనాలు నిర్మించగా.. ఇక్కడ మాత్ర ప్రజాధనాన్ని వృథా చేశారు. ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన షెల్లార్‌కు గోడలు నిర్మించి, గదులుగా చేసి కార్యాలయంగా మమ అనిపించారు. పైభాగం స్లాబ్ వేసి, నిరూపయోగంగానే వదిలేశారు. ఇంజినీర్లకు కూడా అంతుచిక్కని విధంగా ఈ భవనానికి నిధులు వెచ్చించినా కూడా షెల్లార్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భూమిగట్టిదనంతోపాటు, ఇదే అదునుగా కాంట్రాక్టర్ చేతివాటంతో నిధులు మాయమైనట్టు ఆరోపణలు కూడా లేకపోలేదు. మరో రూ.15 కోట్లు మంజూరు చేస్తేనే పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తేల్చిచెప్పారు.

చినుకుతో చిత్తడి.. గోడలకు బీటలు

షెల్లార్‌లోనే కార్యాలయం భవనం పూర్తి చేయడంతో వర్షం పడితే చిత్తడిగా మారుతుంది. అంతేగాక కార్యాలయం గోడలకు బీటలు వారడంతో వర్షం పడితే, బకెట్లను పెట్టి, ఊర్పునీళ్లను పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వానకు సమీకృత భవనంలోకి నీళ్లు చేరుతున్నాయి. రికార్డు రూంతోపాటు, గోడలకు తేమవస్తున్నాయి. అంతేగాక నాణ్యతా లోపంతో పలు చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి.


అసంపూర్తిగా వదిలేసిన కార్యాలయం అసలు భవనం



భవనానికి బీటలు, ఊర్పు నీరు పట్టేందుకు బకెట్లు

అప్రమత్తంగా ఉండాలి : సీపీ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 3 : జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు,పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీపీ డాక్టర్ బి.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని, అవసరమైచోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మట్టితో కట్టిన పురాతన ఇళ్ల నివాసితులను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. వాగులు, చెరువులు, కుంటల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.



ప్రశాంతమైన వాతావరణంలో పండుగ చేసుకోవాలి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 3 : వినాయక నవరాత్రులు ప్రశాంతమైన వాతవరణంలో చేసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాల నిర్వాహకులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సీపీ పలు సూచనలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనేలా సిద్దిపేటలో పండుగలు చేసుకుంటారని, అదే తరహాలో ఈ సారికూడా పండుగ ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలని కోరారు.

కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు

- విచారణ అనంతరం శిక్షను విధించిన కోర్టు
- గజ్వేల్‌లో మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరికి ఏడాది, ఇద్దరికి ఆరునెలల జైలుశిక్ష

గజ్వేల్, సెప్టెంబరు 3: కొత్త చట్టాల (బీఎన్ఎస్) ప్రకారం నమోదైన కేసులో గజ్వేల్ న్యాయమూర్తి సౌమ్య తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. నెల క్రితం గజ్వేల్‌లో మోటార్ సైకిల్ చోరీ కేసులో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన ప్రశాంత్‌రెడి, రామాయంపేట మండల కేంద్రానికి చెందిన శివశంకర్, మంగళ్‌హాట్ హైదరాబాద్‌కు చెందిన రాయలపురం యాదగిరిని అరెస్టు చేశారు. గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.సౌమ్య విచారణ జరిపారు. నేరం ఒప్పుకున్నందున ప్రశాంత్‌కు ఏడాది, శివశంకర్, యాదగిరికి ఆరు నెలల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు తెలిపారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, గోపాల్ గౌడ్, ఎస్ఐ శంకర్, ఎస్ఐ గోపాల్‌గౌడ్, కోర్టు కానిస్టేబుల్ కుమార్ కీలకపాత్ర పోషించారని సీఐ తెలిపారు.

వరద బాధితులకు రూ.1.25 కోట్ల విరాళం

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



మెదక్ అర్బన్, సెప్టెంబరు 3: భారీ వర్షాల కారణంగా జనజీవనానికి ప్రాణ, ఆస్తి, పంట అనేక రకాలుగా నష్టం జరిగిందని, వారిని ఆదుకునేందుకు మెదక్ జిల్లా ఉద్యోగుల ఐక కార్యాచరణ సమితి ప్రభుత్వానికి అండగా నిలిచిందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. సీఎం సహాయ నిధికి తమవంతు సహాయంగా సెప్టెంబరు నెలలో ఒకరోజు మూల వేతనం దాదాపు రూ.1.25 కోట్లను విరాళంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3: బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి మృతి చెందిన రాట్ల సూర్య కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి తండాలోని మృతుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయనుకుంటే నిరుపేదల బతుకులు తెల్లారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే వలసలు కొనసాగుతున్నాయన్నారు. సూర్య భార్య సరితకు రాష్ట్ర సర్కార్ ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ఉద్యోగంతోపాటు వారి పిల్లలకు ఉచిత విద్యను అందించాలన్నారు. పార్టీ తరఫున దుబాయ్ రాయబార కార్యాలయంలో సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా సూర్య మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, వీణ, మెదక్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాస్

శభాష్..పోలీసన్నా..

● వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన ఖాకీలు


వరదలో చిక్కుకున్న వ్యక్తిని రక్షిస్తున్న పోలీసులు

టేక్మాల్, సెప్టెంబరు3 : భారీ వర్షాలకు టేక్మాల్ సమీపంలో గుండు వాగు పొంగింది. నీరు రోడ్లపై నుంచి జోరుగా ప్రవహిస్తున్నప్పటికీ వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి రోడ్డును దాటే క్రమంలో ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. కాసేపటికి ఓ రాయిపైకి చేరాడు. అయితే అక్కడ వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్న టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది అతడిని తాడు సహాయంతో రక్షించారు.

చేపల వేటకు వెళ్లి గల్లంతైన

వ్యక్తి మృతదేహం లభ్యం


లక్ష్మణ్ మృతదేహన్ని తీసుకొస్తున్న పోలీసులు

బెజ్జంకి, సెప్టెంబరు 3: చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తోటపల్లికి చెందిన సందిరి లక్ష్మణ్ (45) ఆదివారం గ్రామశివారులో కల్వర్టు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. వరద ఉధృతి ఎక్కువ కావడంతో నీటిలో గల్లంతయ్యాడు. రెండు రోజులుగా పోలీస్, రెస్క్యూ టీం, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం చెట్లపొదల్లో లభ్యమైంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు శ్రవణ్‌కుమార్ ఉన్నారు. మృతుడి కుమారుడు శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.

గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ మృతి


రాంసాగర్ శివారులో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

రాయపోల్, సెప్టెంబరు 3: గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం రాంసాగర్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన హమీదుల్లాఖాన్(60) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం కర్కపట్ల నుంచి బోధన్‌కు వెళ్లేందుకు కోడిగుడ్ల లోడుతో బయలుదేరాడు. ఈ క్రమంలో రాయపోల్ మండలం రాంసాగర్ శివారులోకి రాగానే డ్రైవింగ్ చేస్తుండగానే హమీదుల్లాఖాన్ ఛాతిలో నొప్పి రావడంతో వాహనాన్ని పక్కకు ఆపి కిందికి దిగాడు. అనంతరం నొప్పి తీవ్రం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు మృతుని భార్య ఆసిఫ్‌అలీ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

బాగా చదువుకోవాలన్నందుకు

పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న శృతి

తూప్రాన్, సెప్టెంబరు 3: మంచిగ చదువుకోవాలని తండ్రి సూచించడంతో మనస్తాపంతో పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని ఆబోతుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం ఆబోతుపల్లికి చెందిన నక్కలపల్లి మహేందర్, రేఖ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్దకూతురు శృతి (15) తూప్రాన్‌లోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం తండ్రి మహేందర్ శృతితో బాగా చదువుకోవాలని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించాడు. అనంతరం ఆయన గేదెలు మేపేందుకు వెళ్లాడు. మనస్తాపం చెందిన శృతి బెడ్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండురోజుల్లో

1800 కోళ్ల మృత్యువాత

● వర్షానికి తడవడం వల్లే..


మృతి చెందిన కోళ్లు

రాయపోల్, సెప్టెంబరు 3: డెలివరీ చేయాల్సిన సమయంలో వర్షానికి తడిసిన దాదాపు 1800 కోళ్లు ఫారంలోనే మృతిచెందాయి. బాధితుడు బచ్చు సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డేపల్లిలో సంతోష్ పౌల్ట్రీఫాంను లీజుకు తీసుకుని కోళ్లను పెంచుతున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్‌కు చెందిన పబ్బోజ్ ట్రేడింగ్ కంపెనీకి మూడు వేల లేయర్ కోళ్ల కోసం ఆర్డర్ చేశాడు. ఇందుకు సంబంధించి పూర్తి డబ్బును సంబంధిత ఏజెన్సీకి పంపించాడు. సంబంధిత కంపెనీ ఈనెల 1న కోళ్లను వ్యాన్‌లో పంపించింది. అవి అప్పటికే తడిసిపోయి ఉన్నాయి. బాధితుడు ఈ విషయాన్ని సదరు ట్రేడింగ్ కంపెనీకి సమాచారం ఇచ్చి అన్‌లోడ్ చేసుకున్నాడు. తడిసిన కోళ్లు కోలుకోకపోవడంతో రెండు రోజులుగా సుమారు 1800 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బాధితుడు తనకు న్యాయం చేయాలంటూ రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రఘుపతి పేర్కొన్నారు.

రుణం చెల్లించాలని రైతుకు బ్యాంకు నోటీసులు

● రుణమాఫీ కాకపోవడంపై ఆందోళన


చిన్నశంకరంపేట, సెప్టెంబరు 3 : ఇటీవల ప్రకటించిన రుణమాఫీలో ఓ రైతుకు రుణమాఫీ కాలేదని, రుణాన్ని చెల్లించాలంటూ చిన్నశంకరంపేట ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు మంగళవారం నోటీసులు పంపించారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గజగట్లపల్లికి చెందిన ఎనుగుల పద్మమ్మ 2020లో సాగు నిమిత్తం రూ.1.45లక్షల రుణాన్ని తీసుకున్నది. తీసుకున్న రుణానికి రెనివల్ చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ తమకు వర్తించలేదని ఆ రైతు కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమకూ రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

వర్షాకాలం జర పైలం

ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి



మెదక్ కల్చరల్, సెప్టెంబరు 3: నిన్నటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు కురిశాయి. ఈ క్రమంలో వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. ఇక లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. ఈ వానల వల్ల రహదారులు సైతం కొట్టుకుపోయాయి. మంచినీటి పైపులైన్లు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ఈ తరుణంలో రోజూవారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం కూడా ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలుతాయి. కొన్నిజాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, వైద్యులు, విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఈ సూచనలు తప్పనిసరి

అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలి.
ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది
సెల్ఫీ, ఫొటోల కోసం చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లకూడదు
వాగులు, వంకలు వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించకూడదు
వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద ఉండకూడదు
చిన్నపిల్లలు వర్షంలో ఆడకుండా, తడవకుండా చూసుకోవాలి
విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి
వర్షంలో తడవకుండా ఉంటే ఇన్ఫెక్షన్లు దరిచేరవు
ఈ కాలంలో జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరం సాధారణంగా వస్తుంటాయి.
కాబట్టి కాచి వడపోసి, చల్లార్చిన నీటిని తాగాలి
కూరగాయలు, పండ్లను బాగా కడిగి తినాలి
వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి
నిలువ ఉంచిన ఆహారాలను తినడం వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చి
రోగనిరోధక శక్తి తగ్గుతుంది
దగ్గు, జలుబుతో బాధపడే వారు తినే ఆహారం,
పానీయాలను ఎవరితోనూ పంచుకోవద్దు
ఈ కాలంలో శీతలపానీయాలు జోలికి అస్సలు వెళ్లకూడదు.
రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి
విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి
ఉతికిన వస్త్రాలను తీగలపై ఆరేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలి
ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్‌శాఖకు తెలియజేయాలి
వర్షం పడుతున్నప్పుడు మోటార్లను తడి చేతులతో ఆన్ చేయకూడదు
తెగిపడిన, వేలాడుతున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలను తాకరాదు
విద్యుత్ మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి
ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తి తాకకూడదు
వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లకు విధిగా ఎర్త్ ఏర్పాటు చేయాలి
ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడాలి.
సొంతం నిర్ణయాలు దూరంగా ఉండండి.

వైరల్ ఇన్ఫెక్షన్ సోకకుండా జాగ్రతలు పాటించండి



భారీ వర్షాలు కురుస్తున్నందున వైరల్ ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంతో జాగ్రత్తలు పాటించాలి. కాచి, వడపోసిన నీటిని మాత్రమే తాగాలి. ముఖ్యంగా గర్భిణులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. బయట ఆహారం తినకూడదు, మందులు సమయానికి వేసుకోవాలి, అత్యవసరకమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ శివదయాల్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త

పంటల వైవిధ్యీకరణకు మొగ్గుచూపాలి

● వ్యవసాయ పరిశోధన కేంద్రం

సీనియర్ శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ శ్రీదేవి



రైతులకు లింగాకార్షక బుట్టలు, మందులను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సిద్దిపేటరూరల్, సెప్టెంబరు 3 : రైతులు పంటల వైవిధ్యీకరణ వైపు మొగ్గుచూపాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీదేవి పేర్కొన్నారు. సిద్దిపేటరూరల్ మండలం తోర్నాల శివారులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం వ్యవసాయ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వివిధ పంటల్లో ఉత్తమ సాగు పద్ధతుల పై రైతులు-శాస్త్రవేత్తలు-విద్యార్థులు చర్చాగోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త శ్రీదేవి రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్ర గురించి వివరించారు. అనతికాలంలోనే విశ్వవిద్యాలయం నుంచి రూపొందించిన వంగడాలు, సాంకేతిక అంశాలను తెలిపారు. వరిలో


చర్చాగోష్టిలో రైతులు, విద్యార్థులు

మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్, పత్తిలో రసం పీల్చు పురుగులకు అసెఫేట్, సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా వేప నూనె, లింగాకర్షక బుట్టలు, ల్యూర్లు (వరిలో మొగి పురుగు, పత్తి గులాబీ రంగు పురుగు మరియు మొక్కజొన్న కత్తెర పురుగు) అందజేశారు. అనంతరం చర్చాగోష్టిలో భాగంగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీజయ, డాక్టర్ సీహెచ్. పల్లవి, డాక్టర్ ఈ.ఉమారాణి, ఎ.సరిత, డాక్టర్ ఎ.రమాదేవి, డాక్టర్ డి.శ్వేత, సతీష్, ఎల్.రాజాలు వివిధ పంటలలో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు సూచనలు నివారణ మార్గాలను రైతులకు వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి రాధిక మాట్లాడారు. రైతులకు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పెసరలో ఎంజీజీ-335 రకంలో రైతులు, విద్యార్థుల సమక్షంలో క్షేత్రస్థాయి ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ యల్. రాజా, ఇర్కోడ్, బస్సాపూర్, ముండ్రాయి, ఘనపూర్, అంకుషాపూర్, చిన్నకోడూర్, చిట్టాపూర్ గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి టెన్నికాయిట్

క్రీడా పోటీలకు ఎంపిక

సిద్దిపేటటౌన్, సెప్టెంబరు 3: జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సిద్దిపేటకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్ 14 బాలుర విభాగం పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చందు, దినేష్, బాలికల విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెజ్జంకి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తన్విక ఎంపికైనట్లు అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలు ఈనెల 30 నుంచి అక్టోబరు 4 వరకు జమ్మూ రాష్ట్రంలో జరుగుతాయని వారు చెప్పారు. రాష్ట్రం తరఫున పాల్గొని జాతీయస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇస్లాంపూర్‌లో ఫీడల్ చానెల్ కాలువకు గండి

● పెద్దచెరువు నిండుతుండడంతో గుర్తుతెలియని వ్యక్తుల పని

● గండిని పూడ్చిన గ్రామస్థులు

తూప్రాన్, సెప్టెంబరు 3: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ పెద్దచెరువు ఫీడర్ చానెల్‌కు గుర్తుతెలియని కొందరు వ్యక్తులు గండి పెట్టారు. గుర్తించిన గ్రామస్థులు గండిని పూడ్చారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తూప్రాన్ పెద్దచెరువులోకి ఫీడర్ చానెల్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ క్రమంలో చెరువు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి ఏర్పడింది. అయితే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పంటలు సాగు చేసిన చెరువు నిండకుండా కుట్ర పన్నారు. చెరువులోకి నీరొచ్చే ఫీడర్‌చానెల్‌కు సోమవారం రాత్రి గండి కొట్టారు. నీరంతా వృథాగా పోవడాన్ని గుర్తిచిన గ్రామస్తులు ఎక్స్‌వేటర్ సహాయంతో గండిని పూడ్చివేశారు. గ్రామానికి చెందిన రాజు, నవీన్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


గండిని పూడుస్తున్న గ్రామస్థులు

కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● పంచాయతీరాజ్ సిద్దిపేట ఎస్ఈ జోగారెడ్డి

తూప్రాన్, సెప్టెంబరు 3: తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి వద్ద దెబ్బతిన్న కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిద్దిపేట జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ జోగారెడ్డి తెలిపారు. తూప్రాన్ శివారులో గౌడిగూడెం రోడ్డులో హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే భారీ వర్షాలకు దెబ్బతింది. దీంతో మంగళవారం ఈఈ చిరంజీవచారి, ఏఈ మధుసూదన్‌తో కలిసి పరిశీలించిన ఎస్ఈ జోగారెడ్డి పరిశీలించారు. రెండు, మూడు రకాలుగా డిజైన్ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈకి సూచించారు. కాజ్‌వే మీదుగా నీటి ప్రవాహం తీరును కూడా ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి సిద్ధం చేయాలని చెప్పారు. తూప్రాన్ పట్టణ పరిధి కిష్టాపూర్ రోడ్డులో హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే గతంలో దెబ్బతినగా వియరింగ్ కోట్ (లేయర్) వేశారు. భారీ వర్షాలకు లేయర్ ఎలా ఉందో పరిశీలన చేశారు. మనోహరాబాద్ మండలం కొండాపూర్ వద్ద దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించి, కొత్తగా నిర్మాణం చేసేందుకు ప్రతపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వారి వెంట డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీడీవో శేషాద్రి, ఎంపీవో సతీష్ పాల్గొన్నారు.


ఆబోతుపల్లి వద్ద గౌడిగూడెం రోడ్డుపై దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈలు



పండుటాకుకు

ఎంత కష్టం

● ఇంటి నుంచి తప్పిపోయి, వివరాలు చెప్పలేని స్థితిలో వృద్ధురాలు

శివ్వంపేట, సెప్టెంబరు 3 : ఇంటి నుంచి తప్పిపోయి, ఎటు వెళ్లాలో తెలియక, నడవలేని స్థితిలో, ఒంటిపై వస్త్రాలు లేక ఆకలితో అలమటిస్తూ కర్రసాయంతో కుటుంబీకుల కోసం ఓ పండు వృద్ధురాలు పడరాని పాట్లు పడుతుంది. సంగారెడ్డి-గజ్వేల్ రహదారిలో శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్క బాయన చెరువు సమీపంలో నర్సాపూర్ వైపు నుంచి ఓ వృద్ధురాలు ఒంటిపై వస్త్రాలు లేకుండా దీనావస్థలో నడుచుంటూ వస్తుంది. చలించిన గూడూరు మాజీసర్పంచ్ కృష్ణగౌడ్, ఎదుల్లా పూర్‌కు చెందిన ముత్యాలు ఆమెకు వస్త్రాలు అందజేశారు. అనంతరం ఆమెను చిన్న గొట్టిముక్క చౌరస్తాలో విడిచిపెట్టారు. ఆమెను స్థానికులు ప్రశ్నించగా ఎలాంటి సమాధానం చెప్పలేకపోతుంది. తనకు ముగ్గురు కొడుకులు ఉన్నారని తప్ప ఇంటి, ఊరి వివరాలు చెప్పలేని స్థితిలో ఉంది. ఆవిడ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని స్థానికులు తెలిపారు.

మేకల దొంగల ముఠా అరెస్టు

● మూడు జిల్లాల్లో భారీ ఎత్తున దొంగతనం

● రూ.4,71,000 నగదు, 9 మేకలు స్వాధీనం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 3 : మేకల చోరీలకు పాల్పడుతున్న ముఠాను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పెద్దశంకరంపేటలో పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి వివరాలు వెల్లడించారు. రోజువారీగా పోలీసులు ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పందగా కొందరు పట్టుబడ్డారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విచారించగా అసలు నిజం చెప్పారు. వీరంతా ఇప్పటి వరకు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలో మొత్తం 16 దొంగతనాలు, దాదాపు 100కు పైగా మేకలను దొంగిలించారని తెలిపారు. వారి నుంచి రూ.4,71,000 నగదును, 9 మేకలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరు మొత్తం 11 మంది కలిసి ఈ చోరీలకు పాల్పడుతున్నారని, అందులో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఆమె వివరించారు. అలాగే చోరీకి పాల్పడిన రెండు వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో గడిపెద్దాపూర్‌కు చెందిన అనిల్‌కుమార్, ఎరుకల అనిల్, ఎరుకలగోపాల్, ముసలాపూర్‌కు చెందిన చిన్నకటికే ఖదీర్‌పాషా, ఇప్ప మహేందర్, సంగారెడ్డికి చెందిన మహమ్మద్ షాహిద్ ఉన్నట్లు తెలిపారు. సమావేశంలోపేట ఎస్ఐశంకర్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రేణుకారెడ్డి

పీసీబీ ఎంఎస్‌తో గడ్డపోతారంవాసుల సమావేశం

జిన్నారం, సెప్టెంబరు 3 : జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని పరిశ్రమల కాలుష్య సమస్యపై ఆ గ్రామవాసులు మంగళవారం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయంలో పీసీబీ మెంబర్ సెక్రటరీ రవితో సమావేశమయ్యారు. ఇటీవల గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లికి చెందిన రైతు సాయికుమార్‌కు చెందిన 15 గేదెలు పరిశ్రమల కాలుష్య జలాలు సేవించి మరణించాయి. గేదెల మృతిపై స్థానికులు ఇటీవల పీసీబీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పరిశ్రమల కాలుష్యంపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలుష్యం తీరు, పశువుల మృతికి కారణాలపై నివేదిక అందిన అనంతరం కాలుష్య నియంత్రణకు చర్యలు, నష్టపరిహారం అంశంపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ సర్పంచులు ప్రకాశంచారి, నీరుడి శ్రీనివాస్, ఎంపీ అశోక్, మాజీ ఎంపీటీసీ బాసెట్టి గారి రాజు, నాయకులు వెంటేష్, వేణు, శివశంకర్ పాల్గొన్నారు. గేదెల మృతికి నష్టపరిహారం విషయంలో యువ రైతుకు న్యాయం చేయాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విన్నవించారు.


పీసీబీ కార్యాలయానికి వెళ్లిన గడ్డపోతారం వాసులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 3 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్ రోడ్డునెంబర్ 7లో నివాసముంటున్న రాజేందర్ సోమవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. భార్య కూడా మూడు రోజుల క్రితం బోనాల పండుగకు ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న పది తులాల వెండి ఆభరణాలు, అరతులం బంగారం, రూ.60,000 నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం రాజేందర్ బంధువులు ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. వెంటనే వారు రాజేందర్‌కు అతని భార్యకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. రాజేందర్ భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: ఎంపీడీవో



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు, సెప్టెంబరు 3: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు కస్తూర్బా పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దారు సంజీవ్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో వీరరాజు, వైద్యాధికారి రజిత, ఈసీ పరుపురాములు, సెక్రటరీ మాదవ్ జాదవ్ ఉన్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరిస్తాం

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

కొండపాక, సెప్టెంబరు 3: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంట సామగ్రిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న పాముల పుట్టను చూసి ఇది విద్యార్థులకు అత్యంత ప్రమాదకరమని, వెంటనే తొలగించాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరగా పాఠశాలలో కోతుల బెడద, పాములు గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా స్నానాలకు వేడి నీరు అందించే విధంగా చూడాలన్నారు. పాఠశాలలో వాలీబాల్ తదితర ఆట వస్తువులు లేవని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ వాలీబాల్ కిట్ పంపిస్తానని హామీ ఇచ్చారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. వైద్యశాఖను ఉద్దేశించి మాట్లాడుతూ.. సిబ్బంది గ్రామాలకు వెళ్లి జ్వర సర్వే నిర్వహించాలని, జ్వరంతో బాధపడుతున్న వారిరక్త నమూనాలు సేకరించి చికిత్స అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గౌతమి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవో, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, వైద్యాధికారి శ్రీధర్ తదితరులున్నారు.



పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి: సీఐటీయూ జిల్లా కార్యదర్శి



పుల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

సిద్దిపేట రూరల్, సెప్టంబరు 3: ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. సిద్దపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పని చేస్తున్న పది లక్షల మంది ఆశాల సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. డబ్ల్యూహెచ్‌వో అంతర్జాతీయ సంస్థ ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించిందన్నారు. 45,46 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సామాజిక భద్రత తదితర సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తునికి మహేష్, ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రెడ్డమైన బలమణి, ఆశా వర్కర్లు శ్రీలత, సావిత్రి, భవాని తదితరులున్నారు.

రైతులను ఆదుకోవాలి

ములుగు, సెప్టెంబరు 3: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి కోరారు. ములుగులో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రతీ ఎకరాకు 20వేల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట భుజక్రం, కనకయ్య, దశరథ తదితరులు ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు

కొండపాక, సెప్టెంబరు 3: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే వారికి 2024-25 సంవత్సరానికి గాను అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని దుద్దెడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, 10వ తరగతిలో అడ్మిషన్ కోసం విద్యార్థులు అపరాధ రుసుముతో అక్టోబరు 3 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, సెప్టెంబరు 3: చేర్యాల పట్టణ శివారుగుండా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ జితేందర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీరేశ్ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

గజ్వేల్, సెప్టెంబరు 3: గజ్వేల్ పట్టణంలోని రేషన్ దుకాణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని షాప్ నెంబర్ 8, 9, 33, 36లను సివిల్ సప్లయి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ద్రోణాచార్యులు, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, టెక్నికల్ అసిస్టెంట్ విజయభూషణంలు తనిఖీలు నిర్వహించారు. ఆయనవెంట గజ్వేల్ ఆర్ఐ కృష్ణ, రేషన్ డీలర్లు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

చేర్యాల, సెప్టెంబరు 3: చేర్యాల మండల కేంద్రం శివారు ఆకునూరు దారిలో లారీ ఢీకొన్న సంఘటనలో పట్టణానికి చెందిన పుట్ట పరమేశ్వర్ తీవ్రగాయాలపాలయ్యాడు. బైక్‌పై పరమేశ్వర్ వ్యవసాయ బావివైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

బెజ్జంకి, సెప్టెంబరు 3: పేకాట స్థావరంపై దాడి చేసి పది మందిని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తోటపల్లి శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయం సమాచారం మేరకు మంగళవారం రాత్రి సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని రూ. 34,090 నగదు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం తాగి వీరంగం..

ముగ్గురిపై కేసు

చేర్యాల, సెప్టెంబరు 3: చేర్యాల మండల కేంద్రం శివారు కడవేరుగు దారిలో సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి వీరంగం సృష్టించిన పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్



సీపీకి మొక్కలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 3: సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్శిత్‌కుమార్ మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రెండు మూడు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతున్నందున సిద్దిపేట పట్టణంలోని పరిస్థితిని సీపీ అడిగి తెలుసుకున్నారు.

గద్దర్ అవార్డు అందుకున్న రత్నం

చేర్యాల, సెప్టెంబరు 3: కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కు చెందిన ఉద్యమగాయకుడు పిన్నింటి రత్నం ప్రజాకవి గద్దర్ అవార్డును అందుకున్నాడు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో గిద్దె గళం సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గిద్దె రాంనర్సయ్య, గట్టగల్ల సంజీవ తదితరుల చేతులమీదుగా అవార్డు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక గద్దర్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 3: మండలంలోని తిగుల్ రైతువేదికలో రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు కిరణ్‌బాబు, తెగుళ్ల శాస్త్రవేత్త గోపాలవర్మ, కీటక శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'అంతర పంటలు సాగు చేయాలి'

అక్కన్నపేట, సెప్టెంబరు 3: రైతులు అంతర పంటలు సాగు చేయాలని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. మండలంలోని మైసమ్మవాగు తండాలో అంతర పంటల సాగుపై మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు మాత్రమే అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఫీల్డ్ కో ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు కనకం రవీందర్, భూక్య బిచ్చ, మడావత్ తిరుమల, పిల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

గజ్వేల్, సెప్టెంబరు 3: పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని దిలాల్‌పూర్, వీడిచెడ్, అహ్మదీపూర్ గ్రామాల్లో గజ్వేల్ ఏవో నాగరాజుతో కలసి ఆయన పంటలను పరిశీలించారు. ఆయనవెంట ఏఈవో నర్సింహులు గణేశ్, రైతులు ఉన్నారు.

విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే శాశ్వతంగా ఉంటాయని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ అన్నారు. గజ్వేల్ వ్యవసాయ డివిజన్‌లో ఏవో, ఏఈవోలుగా పనిచేసి బదిలీపై వెళ్లిన వారికి ఆయన మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఆయన కార్యాలయంలో శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఆయనవెంట ఏవోలు నాగరాజు గోవిందరాజులు, ప్రియదర్శిని, నరేశ్, ఏఈవోలు ఉన్నారు.

మున్సిఫ్ కోర్టును ప్రారంభించాలి

చేర్యాల, సెప్టెంబరు 3: చేర్యాల మున్సిఫ్‌కోర్టును వెంటనే ప్రారంభిచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేర్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో గాంధీచౌక్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్లక్రితం చేర్యాలకు కోర్టు మంజూరుచేసి భవనం కేటాయించినప్పటికీ సేవలు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హరీశ్‌రావు కాన్వాయ్‌పై దాడి పిరికిపంద చర్య

● బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 3: వరదల సమయంలో ప్రతిపక్షం, పాలకపక్షం అని చూడకుండా కలిసి పని చేయాలి కానీ, ప్రతిపక్షం సహాయం చేస్తుంటే అధికార పార్టీ అడ్డుకోవడం, దాడులు చేయడం ఏమిటని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డితో కలిసి వారు మాట్లాడారు. ఖమ్మంలో వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్లిన ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, సబిత ఇంద్రరెడ్డిల వాహనాలపై రాళ్ల దాడి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అరవింద్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, మోహిజ్, సాయిప్రేమ్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు. ఖమ్మంలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే కాన్వయ్‌పై రాళ్లతో దాడి చేయడం ప్రభుత్వ పిరికిపంద చర్యగా భావిస్తున్నామని చిన్నకోడూరు మండల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గుజ్జ రాజు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



సిద్దిపేట టౌన్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో నాయకులు పడిగే లింగం, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, జానకి చందు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పరామర్శకు వెళితే దాడులు చేస్తారా అని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం పర్యటనలో ఉన్న మాజీ మంత్రులపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు

● **చిన్నకోడూరు:** ఖమ్మం జిల్లాలో వరద బాధితులకు సాయం చేయడానికి వెళ్లిన మాజీ మంత్రుల వాహనాలపై కాంగ్రెస్ నాయకులు రాళ్ల దాడి చేయడం అమానుషమని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, సెప్టెంబరు 3: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోర్రగూడెం మండల ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, పాఠశాల నిర్వహణ తీరు మెరుగ్గ ఉండడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండలంలోని మిగత పాఠశాలలు బోర్రగూడెం పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాల కోసం నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఆయనవెంట గజ్వేల్ నియోజకవర్గ ప్రచార కమిటీ ఛైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు రహీం, చెన్నయ్య, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

బోర్రగూడెం నుంచి చందాపూర్‌కు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు వద్ద కొట్టుకపోవడంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. సంబంధిత అధికారులు తక్షణమే తాత్కలిక చర్యలు చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదేశించారు. దండుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బోర్రగూడెం నుంచి చందాపూర్‌కు వెళ్లే మార్గంలోని కల్వర్టు నీటి ప్రవహానికి కొట్టుకపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న తూంకుంట నర్సారెడ్డి మంగళవారం సంఘటన స్థలానికి చేరుకుని తాత్కాలిక చర్యలు చేపట్టాలని పంచాయితీ రాజ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ ప్రభాకర్‌ను ఆదేశించారు. ఆయన వెంట గజ్వేల్ నియోజకవర్గం ప్రచార కమిటీ ఛైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, తొగుట సీఐ లతీఫ్, పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.



కల్వర్టును పరిశీలిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో 22 ఇళ్లు ధ్వంసం

చేర్యాల, సెప్టెంబరు 3: వర్షాల కారణంగా చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో 12, కొమురవెల్లి మండలంలో 10ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు ఆయా మండలాల తహసీల్దార్లు సమీర్ అహ్మద్‌ఖాన్, లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. బాధితులకు రూ.3,200 చొప్పున పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు. పోసాన్‌పల్లికి చెందిన పొన్న తిరుపతి ఇంటి మూడుగదుల పైకప్పు నేలకూలింది. కుటుంబసభ్యులంతా మరో గదిలో నిద్రించడంతో ప్రాణాపాయం తప్పింది.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన

వరదనీటి ప్రవాహ బెడద తీర్చేందుకు చేర్యాల మండలం కడవేరుగు శివారులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంగళవారం కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కడవేరుగు శివారులోని లో-లెవల్ కాజ్‌వేవద్ద టెంట్ వేసి రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో కడవేరుగు శివారులోని కాజ్ వే మీదుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మాణంపై హామీలు ఇచ్చినా పట్టించుకోకపోవడం తగదన్నారు. ప్రాణనష్టం సంభవించకముందే పనులు చేపట్టాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వారాంతపు సంతలో ఇక్కట్లు

చేర్యాల పట్టణంలో ప్రతీ మంగళవారం వారాంతపుసంత నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం కురిసిన వర్షం కారణంగా తీవ్ర ఆటంకం కలిగింది. కూరగాయలు విక్రయించుకునేందుకు వచ్చిన పొరుగు గ్రామాలకు చెందిన రైతులు గొడుగులు చేతపట్టుకుని వర్షంలోనే కూర్చొని పడిగాపులు కాశారు.



చేర్యాల, నాగపురి ప్రధానరహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

ఎల్లాయగూడెంలో భారీ వర్షం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 3: మండలంలోని ఎల్లయ్యగూడ గ్రామంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇటు పొలాల ద్వారా వచ్చే నీరు, వర్షం నీటితో రెండు కాలనీల గుండా భారీ వరద ప్రవహించింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చెరువులను పరిశీలించిన ఆర్డీవో

గజ్వేల్, సెప్టెంబరు 3: గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట కాలువ, ప్రజ్ఞాపూర్‌లోని ఊర చెరువు కాలువను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ పరిశీలించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్ రజిత, ఆర్ఐ కృష్ణ, మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులున్నారు. రిమ్మనగూడ, కోమటిబండ, జాలిగామ, కోనాపూర్ గ్రామాల పరిధిలోని చెరువు, కుంటలను గజ్వేల్ సీఐ సైదా పరిశీలించారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

దౌల్తాబాద్/రాయపోల్, సెప్టెంబరు 3: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం గణేష్ ఉత్సవాల శాంతి సమావేశంలో మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు శాంతియుతంగా జరుపుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఆయా గ్రామాల యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు, వినాయక విగ్రహాల ఏర్పాటులో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. రాయపోల్ పోలీస్‌స్టేషన్ సందర్శించారు. సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయనవెంట తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రఘుపతి ఉన్నారు.



మద్దూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ మహబూబ్

● **కుకునూరుపల్లి:** ఉమ్మడి కొండపాక మండల పీస్ కమిటీ సమావేశాన్ని కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో కుకునూరుపల్లి పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి మండల తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, మండల విద్యుత్ అధికారి రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ.. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, విద్యుత్ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ పి. శ్రీనివాస్, పలువురు రాజకీయ, గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **దుబ్బాక:** పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. దుబ్బాకలోని పద్మశాలి సంఘం భవనంలో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ గంగరాజు తదితరులున్నారు.

● **చేర్యాల:** భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వినాయకనవరాత్రోత్సవాలను జరుపుకోవాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. చేర్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల ఆర్గనైజర్లు, కులమతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక మండపాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ విధిగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్ పాల్గొన్నారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజుగౌడ్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు, పండుగలు జరుపుకోవాలని సూచించారు.

● **వర్గల్:** పండుగలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించుకోవలని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆయా గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దౌల్తాబాద్: మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

'పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యత'



సిద్దిపేట పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్/మద్దూరు, సెప్టెంబరు 3: పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యతని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పట్టణంలోని 3వ వార్డులో పర్యటిస్తున్న సందర్భంలో ఖాళీస్థలాల్లో చెత్త, పిచ్చి చెట్లు ఉండడం గమనించి కమిషనర్ వెంటనే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. వార్డులో ఏపుగా పెరిగినటువంటి చెట్ల కొమ్మలను నరికివేయాలని ఆదేశించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించారు. కోమటిచెరువు వద్ద ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వెలువడే హానికర చెత్తను మున్సిపల్ చెత్త వాహానానికి ఇవ్వాలని, పట్టణ శివారు, బహిరంగ ప్రాంతాల్లో వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రీయాజుద్దిన్, నాయకులు సాకి ఆనంద్, అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మద్దూరు మండలంలోని రేబర్తిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామ్మోహన్ మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో గ్రామంలోని వీధులతో పాటు మురుగు కాల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్, ఆయిల్‌బాల్స్ వేసి ముందస్తు చర్యలు తీసుకోవడంపై సెక్రటరీ జాదవ్ మాదవ్‌ను అభినందించారు. ఆయనవెంట వైద్యాధికారి సువర్ట్ సన్, ఫీల్డు అసిస్టెంట్ అయిలయ్య, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, ఆశాలు కవిత పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లోకి వరదనీరు రాకుండా చూడాలి

● మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, సెప్టెంబరు 3: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు వచ్చే వర్షాకాలం నాటికి హుస్నాబాద్ పట్టణంలోకి వరదనీరు రాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు, పందిల్ల బ్రిడ్జిని మంగళవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దుకాణాల్లోకి వచ్చే వరదనీటితో వ్యాపారులు నష్టపోతున్నారని, ఇక ముందు అలా జరుగకుండా చర్యలు చేపట్టాలని, లేకపోతే తామే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు ఎండీ. అన్వర్, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, అయిలేని శంకర్‌రెడ్డి, హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎడోయిన తిరుపతిరెడ్డి, గంగం మధుసూదన్‌రెడ్డి, పూదరి రవీందర్ తదితరులున్నారు.

రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి దయనీయం

● ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వర్ధన్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 3: రాష్ట్రంలో విద్యారంగ సరిస్థితి దయనీయంగా ఉందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వర్ధన్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన ఏబీవీపీ నాయకులతో కలసి మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారడం లేదన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తున్నదని ఆరోపించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో గురుకుల సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్, నగర కార్యదర్శి పరశురాం, నందు, కార్తీక్, నరేష్, అభినయ్, శ్రీనివాస్, సాయి, గణేష్, రాకేష్, శేఖర్, ధనుష్, అజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలి

● అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.భాస్కర్



మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.భాస్కర్

సిద్దిపేట రూరల్, సెప్టంబరు 3: విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.భాస్కర్ విద్యార్థులుకు సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మంగళవారం రీడ్ ఎ థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీ రోజు చదవడం అలవాటు చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. రాత్రి పడుకునే ముందు ఏదైనా ఒక నవల కాని, కథ కాని, మనకు నచ్చినటువంటి పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా మారడానికి పఠనం చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు, రూమ్ టు కో ఆర్డినేటర్ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో పలు వీధుల్లో ఆరు నెలలుగా పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రతీ రోజు విద్యుత్ దీపాలు వెలిగే ఉండడంపై మూడు నెలల క్రితం ఆంధ్రజ్యోతిలో 'పగలే వెలుగుతూ' అనే శీర్షిక వార్త ప్రచురించగా స్పందించిన అధికారులు మరమ్మతులు చేసి పగలు వెలగకుండా చేస్తామని తెలిపారు. కానీ 3 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

\- కుకునూరుపల్లి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లే దారి చిన్నపాటి కాలువగా మారింది. మండల కేంద్రంలో కురిసిన వర్షపు నీళ్లు ఆస్పత్రి దారి గుండానే వెళ్తున్నాయి. దీంతో ఆస్పత్రికి వెళ్లే దారి నీళ్లతో నిండిపోయింది. తీవ్ర ఇబ్బందులు పడుతూ రోగులు, ప్రజలు ఆస్పత్రికి చేరుకుంటున్నారు.

\- కుకునూరుపల్లి

